



## ₹15.75 లక్షలతో సీఏ ఉడాయింపు

**రాణాలో మహిళా సంఘాల సభ్యుల ఫిర్యాదు**



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మహిళలు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 7: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ (టెక్స్‌టైల్‌పార్క్)లో మహిళా సంఘాల సీఏ సంఘాల్లోని ₹15.75 లక్షల డబ్బులతో ఉడాయించిందని మహిళా సంఘాల సభ్యులు సోమవారం తంగళ్లపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మకాలనీకి చెందిన అన్నల్‌దాస్ కల్యాణి సీఏగా పనిచేస్తున్నది. మహిళా సంఘాల సభ్యులైన ఒక్కో మహిళ పేరిట ₹లక్ష, లక్షన్నర, ₹50 వేలు రుణం తీసుకుని, వారితో సంతకాలు తీసుకున్నది. అయితే, సీఏ కావడంతో నోటి మాట మీద నమ్మి సంతకాలు పెట్టామని, తీర్మానాలు రాస్తదని నమ్మినట్టు మహిళా సంఘాల సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ₹15.75 లక్షలతో సీఏ పారిపోయిందని, ఆమె భర్త గణేశ్, కుటుంబ సభ్యులను అడిగితే తమకు సంబంధం లేదని అంటున్నారని వాపోయారు. సీఏ నుంచి డబ్బులు వసూలు చేసి, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

## పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- డీఎస్సీ పరీక్షల ద్వారా జిల్లాలో 140 మంది టీచర్ల ఎంపిక
- నియామక పత్రాలు పంపిణీకి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో రివ్యూ

కలెక్టరేట్, అక్టోబర్ 7: డీఎస్సీ పరీక్షల ద్వారా ఎంపికైన టీచర్ అభ్యర్థులు అక్టోబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించే నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నియామకపత్రాలు పంపిణీ కార్యక్రమానికి అభ్యర్థుల హాజరుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఖాళీగా ఉన్న 140 టీచర్ పోస్టులను డీఎస్సీ పరీక్షల ద్వారా ప్రభుత్వం భర్తీ చేయడం జరిగిందన్నారు. డీఎస్సీ ప్రకటించిన ఫలితాలు 1:3 కింద అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి, 140 అభ్యర్థులను టీచర్ పోస్టులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 9న హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అభ్యర్థులకు నియామక పత్రాలు పంపిణీ కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి రాజన్నసిరిసిల్ల జిల్లా నుంచి అభ్యర్థులు హాజరయ్యేందుకు అవసరమైన చర్యలు కట్టుదిట్టంగా తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 9న మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని వేదికకు చేరుకునేలా వేములవాడ నుంచి ఒక బస్సు, సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి 2 బస్సులు అభ్యర్థులతో బయలుదేరాలని, ప్రతి బస్సుకు ఒక లైసెన్ అధికారి ఏర్పాటు చేయాలని, అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలు పక్కాగా ఉండేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఈవో రమేశ్, డీఎంహెచ్‌వో వసంతరావు, డీసీఎస్‌వో వసంత లక్ష్మి, వేములవాడ సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్లు ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

# పండుగ పూట పస్తులేనా..?

- సంక్షోభంలో వస్త్ర పరిశ్రమ
- ఉపాధి లేక ఆగమైతున్న జీవితాలు
- ప్రభుత్వ ప్రోత్సాహం అంతంతే
- ఆందోళనలో నేతన్నలు

**సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తెలంగాణకే తలమాణికంగా దశాబ్ద కాలంగా ఓ వెలుగు వెలిగింది. గత సర్కారిచ్చిన చేయూతతో తుప్పు వదిలిన మరమగ్గం జరి పోగై మెరిసింది. చేతినిండా పని, పనికి తగ్గ వేతనం పొందిన నేతన్నకు కాంగ్రెస్ సర్కారు రిక్తహస్తం చూపింది. బతుకమ్మ చీరల బంద్‌తో బతుకు ఛిద్రమైంది. పనిలేక పండుగ పూట పస్తులుండే దుస్థితి నెలకొన్నది. వస్త్ర పరిశ్రమలో మళ్లీ సంక్షోభంలోకి పడిపోయి, 2014కు పూర్వస్థితికి చేరింది.**



సర్కారు చేయూత కరువై తుక్కుకింద అమ్మేందుకు సిద్ధంగా ఉన్న సాంచాలు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): నాడు ఆకలి చావులు, ఆత్మహత్యలతో ఉరిసిల్లగా మారిన సిరిసిల్లకు సిరులు కురిపించేలా గత కేసీఆర్ సర్కారు చేయూత నిచ్చింది. రూ.వేల కోట్ల నిధులతో బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లతో బతుకునిచ్చింది. వలసలను నిరోధించి ఇతర రాష్ట్రాల కార్మికులు ఇక్కడకు ఉపాధి బాట పట్టేలా చేసింది. ఒక్కటి కాదు రెండు కాదు 30వేల మరమగ్గాలను ఆధునీకరించింది. యజమానులు, ఆసాములు, కార్మికులతో మూడంచెల వ్యవస్థ గల వస్త్ర పరిశ్రమను గాడిలో పెట్టేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన కృషితో పరిశ్రమ అభివృద్ధి పరుగులు పెట్టింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించింది. వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లతో యజమానులకే కాకుండా ఆసాములు, కార్మికులు బాగుపడాలన్న ఉద్దేశ్యంతో విద్యుత్, నూలు రాయితీలు అందించింది. కార్మికుడు ప్రతినెలకు రూ.15వేల నుంచి రూ.20వేల దాకా కూలీ పొందేలా చర్యలు తీసుకుంది. వచ్చిన వేతనంతో వృథా ఖర్చులు చేయకుండా త్రిఫ్ట్ (పొదుపు) పథకం ప్రవేశపెట్టింది. బతుకమ్మ చీరలకు ఇచ్చిన నూలు సబ్సిడీ సైతం కార్మికుడికే చెందేలా చేసింది. దీంతో ఏడాదికి అదనంగా ఒక్కో కార్మికుడు రూ.20వేల నుంచి రూ. 30వేలు పొందాడు. త్రిఫ్ట్ పథకంలో జమచేసిన పైసలతో పిల్లల పెండ్లిళ్లు, ఇండ్లు కట్టుకున్న కార్మికులున్నారు. ఆడుతూ పాడుతూ సాంచాలు నడిపి సంతోషంగా పదేండ్లు గడిపిన కార్మికులకు తిరిగి పూర్వపు రోజులు దాపురించాయి.

**బతుకమ్మ బంద్ అయ్యింది.. జోటా ఆగింది..**

మార్పు వస్తుందని ఆశించిన నేతన్నకు కొత్త సర్కారు రిక్త హస్తం చూపింది. బతుకమ్మ చీర బంద్ అయ్యింది. జోటా ఆగింది. ఉన్న ఉపాధి పోయింది. పదేండ్లు చేతినిండా పని చేసి నాలుగు రూకలు వెనుకేసుకున్న నేతన్న బతుకు భారమైంది. బతుకమ్మ, దసరా పండుగలకు పస్తులుండే దుస్థితి నెలకొంది. బతుకమ్మ చీరలు బాగా లేవంటూ బంద్ చేసిన సర్కారు ప్రత్యామ్నాయ పనిచూపలేక పోయింది. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇచ్చే చీరలు ఆర్డర్లు ఇస్తామని ఆశచూపింది. ఎప్పుడిస్తారో తెలియదు కానీ, ఇప్పటి వరకు కార్మికుడు ఎలా బతుకుతున్నారన్నది మాత్రం ఆలోచించలేదు. 2023 సంవత్సరం నుంచి రావాల్సిన యారన్ సబ్సిడీ పైసలు సైతం ఇవ్వలేదు. యారన్ సబ్సిడీ పైసలు గతంలోనే ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. అయినా ఇంత వరకు విడుదల చేయలేదు. 5200 మంది కార్మికులకు సుమారు రూ.9కోట్ల వరకు రావాల్సి ఉందని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. కనీసం అవైనా ఇస్తే దసరా పండుగ చేసుకుంటామన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. పిల్లలకు కొత్త బట్టలు కొనలేని దైన్య స్థితిలో కార్మికులున్నారు. మరోవైపు మరమగ్గాలకు ఇచ్చే విద్యుత్ సబ్సిడీకి సర్కారు రద్దు చేసింది. సాంచాలకు ఇచ్చే కరెంటు యూనిట్ రూ.2 ఉన్నదానిని రూ.8కి పెంచడంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు బతుకమ్మ చీరలు లేక సాంచాలు అమ్ముకుంటున్న యజమానులపై పెనుభారం పడ్డట్లయింది. ఇప్పటికే రెండువేల సాంచాలు ఇనుప సామాన్లకు అమ్ముకున్నారు. మరిన్ని అమ్ముకునేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం తొందరగా స్పందించి ఆర్డర్లు ఇస్తేనే కార్మికులకు ఉపాధి. లేదంటే ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు.

### పండగన్న సంబురం లేదు..

బతుకమ్మ చీరలు ఇచ్చి కేసీఆర్ కడుపు నింపిండు. పదేండ్లలో పనికి, పైసలకు కొదవంటూ లేదు.



ప్రతి పండగను సంతోషంగా చేసుకున్నం. సాంచాలు మంచిగ నడిసినయ్. ఏడాదిలో ఎనిమిది నెలలు పనిచేస్తే నెలకు రూ.20వేల పగారొచ్చింది. యారన్ సబ్సిడీ పైసలు అవో రూ.20 వేలదాకత్తుండే. బతుకమ్మ చీరలు బందయి గోసగోసైతంది. ఆడా ఈడా అప్పు తెచ్చుకుని సగం కడుపుకే తింటున్నం. పప్పు ఉప్పు బియ్యం అన్నింటి ధరలు అడ్డగోలు పెరిగినయ్. పండుగొచ్చిందన్న సంబురం లేదు. సర్కారు యారన్ సబ్సిడీ పైసలన్న ఇత్తలేదు. పిల్లలకు బట్టలు తెద్దామన్న చిల్లిగవ్వలేదు. కేసీఆర్ సారుంటే ఇంత గోసపడేటోళ్లం కాదు.

**- వేముల మల్లేశం, నేత కార్మికుడు (సిరిసిల్ల)**

### యారన్ సబ్సిడీ నిధులు విడుదల చేయాలి

పదినెలలుగా సాంచాలు బంద్‌పడి పనిలేక కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే 12 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. బతుకమ్మ చీరల స్థానంలో మరో రకం చీరలు ఇస్తామంటూ ప్రభుత్వం



చెబుతున్నది. కానీ ఎప్పుడు ఇస్తుందో స్పష్టత లేదు. వర్కర్ టూ ఓనర్ పథకం కింద సాంచాలు కార్మికులకు ఇచ్చి పని కల్పించాలి. బతుకమ్మ, దసరా పెద్ద పండుగలు. చేతిలో చిల్లిగవ్వలేక పండుగలు కూడా సంతోషంగా జరుపుకునే పరిస్థితి లేదు. యారన్ సబ్సిడీ పైసలు ఇస్తామని ఇంత వరకు విడుదల చేయలేదు. సబ్సిడీ పైసలు ఇస్తే పండగన్న జరుపుకునే అవకాశం ఉంటుంది. మంత్రులు స్పందించి నేత కార్మికులను ఆదుకోవాలి.

**- మూషం రమేశ్, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు**

## స్కందమాత నమోస్తుతే..

వేములవాడ టౌన్, అక్టోబర్ 7 : దేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా వేములవాడ శ్రీ రాజన్న ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారు సోమవారం స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రాంగణంలోని నాగిరెడ్డి మండపంలో కొలువుదీరిన అమ్మవారికి ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం, రాజరాజేశ్వరీదేవికి అభ్యంగన స్నానం, మహాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. నాగిరెడ్డిమండపంలో ఘనంగా హవనం నిర్వహించారు. రాత్రి అమ్మవారిని పట్టణ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



స్కందమాత అలంకారలో దర్శనమిస్తున్న అమ్మవారు

## ప్రత్యేక బందోబస్తు

వేములవాడ టౌన్, అక్టోబర్ 7: వేములవాడలో సద్దుల బతుకమ్మకు అంతా సిద్ధమైంది. రాజన్న క్షేత్రం సహా మూలవాగు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వేడుకల సందర్భంగా ఎక్కడా ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌శాఖ బందోబస్తు చేపట్టేందుకు సిద్ధమైంది. ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 65మంది పోలీస్ కానిస్టేబుల్లు, 30 మంది హోంగార్డ్స్, 20మంది డిస్ట్రిక్ట్ గార్డ్స్, 20మంది మహిళా కానిస్టేబుల్స్, 2జీప్ పెట్రోలింగ్ వాహనాలతో బందోబస్తు చేపడుతున్నామని, మహిళలు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే 'డయల్ 100'కు ఫోన్ చేయాలని సీఐ వీర ప్రసాద్ సూచించారు. ఆయా చోట్ల సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను వేములవాడ తహసీల్దార్ మహేశ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేశ్, మాజీ సెస్‌డైరెక్టర్ రామతీర్థపు రాజు, కౌన్సిలర్లు పరిశీలించారు.

## క్రీడలతో మానసికోల్లాసం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- రెండో పోలీస్ స్పోర్ట్స్ మీట్



క్రీడల్లో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, అక్టోబర్ 7 : శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీస్ అధికారులకు క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో వార్షిక స్పోర్ట్స్ మీట్ పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. మొదటగా శాంతి కపోతాలను, బెలూన్స్ ఎగురవేశారు. అనంతరం పోలీస్ క్రీడాకారులు ఒలంపిక్ కాగడ చేతభూని పరేడ్ గ్రౌండ్ చుట్టూ పరిగెత్తి క్రీడాజ్యోతిని వెలిగించి ప్రతిజ్ఞజన నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరికీ డ్యూటీ, కుటుంబ ఒత్తిడిలను అధికమించడానికి, శారీరక దృఢత్వంతో పాటుగా ఆరోగ్యాన్ని కలిగిస్తాయన్నారు. ఆటల్లో గెలపోటములు సహజమని టీమ్ స్పిరీట్‌తో పాల్గొని విజయంసాధించాలని సూచించారు. మూడు రోజుల పాటు సాగే క్రీడల్లో వాలీబాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, తగ్గాఫర్, అథెలిటిక్స్ క్రీడలను కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.